క్లుప్తంగా

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

• రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు

బొబ్బిలి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటిని అరికట్టాల్సిన బాధ్యత అంగన్వాడీ కేంద్రాలు, సచివాలయాల సిబ్బందిదేనని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు అన్నారు. పారాదిలోని అంగన్వాడీ, సచివాలయాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇటీవల బాల్య వివాహాల ప్రయత్నాలు ఎక్కువగా ఉన్నట్లు జిల్లా కేంద్రంలోని ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పర్యటించి ప్రజలను చైతన్యవంతం చేస్తున్నట్లు తెలిపారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ విషయంలో సచివాలయంలో ఉన్న మహిళా పోలీసులు కీలకపాత్ర పోషించాలన్నారు. ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి, ఉత్తరావిల్లి ధనుంజయ్, తదితరులున్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల అందజేత

వంగర: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ఉపాధి హామీ పనుల వేతనదారుల వద్దకు ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు వెళ్లి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్నారు. సోమవారం బంగారువలస గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల ప్రదేశానికి ఆశాకార్యకర్తలు వెళ్లి, వాటిని అందజేసి, అవి ఎలా వాడాలో తెలిపారు. వేసవి నేపథ్యంలో వడదెబ్బ బారి నపడకుండా తక్షణ శక్తి కోసం వీటిని పంపిణీ చేస్తున్నట్లు సిబ్బంది తెలిపారు.

భూముల రీసర్వే వేగవంతం

వంగర: భూముల రీసర్వేను వేగవంతం చేయాలని డీటీ బూరాడ సుందరరావు సూచించారు. సోమవారం మండలంలోని రుషింగి గ్రామంలో జరుగుతున్న సర్వేను పరిశీలించిన ఆయన రైతుల సమక్షంలోనే సర్వే, హద్దురాళ్ల ఏర్పాటు చేయాలని తెలిపారు.

రేగిడి: మండలంలోని ఉనుకూరులో జరుగుతున్న భూముల రీసర్వేపై సోమవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు టి.కల్యాణ్‌చక్రవర్తి మాట్లాడుతూ రైతుల మధ్య నెలకొన్న భూ తగాదాల పరిష్కారమే లక్ష్యంగా చేపడుతున్న ఈ సర్వేకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. సర్వే సిబ్బంది కూడా రైతుల సమక్షంలోనే సర్వే, హద్దురాళ్ల ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గేదెల వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ బొక్కేల రాంబాబు, సర్వేయర్ నిఖిల్, వీఆర్వోలు ఏపీ సత్యనారాయణ, కిరణ్, రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాల్సిందే..

మెంటాడ: వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమావేశానికి అధికారులు అరకొరగా హాజరుకావడం సరికాదన్నారు. అనంతరం వ్యవసాయ, హౌసింగ్, విద్యుత్, రెవెన్యూ, విద్యకు సంబంధించిన అంశాలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకట్రావ్, తదితరులు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

రాజాం సిటీ: స్థానిక శ్రీకాకుళం, చీపురుపల్లి, బొబ్బిలి రోడ్లలో పోలీసులు సోమవారం వాహనాల తనిఖీలు చేపట్టి, పెండింగ్ చలానాలను వాహనదారులతో కట్టించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు సంబంధిత ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. అలాగే మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత యజమానులే బాధ్యులన్నారు.

'జగనన్నకు చెబుదాం'

సంతకవిటి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి మాట్లాడుతూ స్పందన కార్యక్రమం దృష్టికి వచ్చిన ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అలాగే సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి నేరుగా సమస్య చెప్పుకునేందుకు ప్రభుత్వం కేటాయించిన 1902 టోల్‌ఫ్రీ నంబర్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

రేగిడి: చెరకు సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని సంకిలి ఈఐడీ ప్యారీ సుగర్ ఫ్యాక్టరీ డీజీఎం ఎం.రమేష్‌కుమార్ రెడ్డి, ఏజీఎం కమలపట్నాయక్, కేన్ ఏజీఎం కె.అప్పారావు తెలిపారు. సోమవారం మండలంలో ఉంగరాడమెట్ట వద్ద వంగర, రేగిడి మండలాల్లో చెరకు సాగుచేస్తున్న రైతులకు అధిక దిగుబడులకు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. కూలీల కొరతను అధిగమించేందుకు వ్యవసాయ యాంత్రీకరణపై రైతులు దృష్టిసారించాలని తెలిపారు. ఆధునీకరణ పద్ధతుల్లో పంట సాగుచేస్తే మంచి దిగుబడులు వస్తాయన్నారు. అనంతరం సాగులో అధిక దిగుబడులు సాధించిన ఉంగరాడకు చెందిన రైతు పాశిర్ల కృష్ణ, వంగర మండలం, మగ్గూరుకు చెందిన రైతు జి.ఆదినారాయణ, వెంకటాపురానికి చెందిన రైతులు కె.సురేష్, కె.రఘురామయ్యలకు బహుమతులు అందజేసి, సన్మానించారు. కార్యక్రమంలో సీడీఓ ఎం.సాయికుమార్ పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

• ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



రామభద్రపురం: సేవావజ్ర అవార్డు పొందిన పూడి జగదీష్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు

రామభద్రపురం: సేవే పరమావధిగా విధులు నిర్వహిస్తున్న వలంటీర్లకు ప్రతి ఒక్కరూ రుణపడి ఉంటారని, వారి సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. సోమవారం స్థానిక సచివాలయం -2లో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే శంబంగి పలువురు వలంటీర్లకు అవార్డులు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎటువంటి అవినీతి లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థ తీసుకువచ్చారన్నారు. అలాగే సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పించారని చెప్పారు. భవిష్యత్‌లో మరింత చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని సూచించారు. ఇదిలా ఉంటే కార్యక్రమానికి వలంటీర్ల హాజరు తక్కువగా ఉండడంపై ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి, సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు, వైస్ ఎంపీపీలు పెంకి అరుణ, బెల్లాన ప్రసాదరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎన్ రాయులు, పీఏసీఎస్ చైర్మన్ కిర్ల చంద్రశేఖర్, జేసీఎస్ మండల చైర్మన్ చింతల సింహాచలంనాయుడు, ఎంపీడీఓ రమామణి, తదితరులు పాల్గొన్నారు.

సేవలే గుర్తింపునిస్తాయి: ఎమ్మెల్యే జోగులు



రాజాం సిటీ: సత్కారం పొందిన వలంటీర్లతో ఎమ్మెల్యే కంబాల జోగులు, తదితరులు



రాజాం: ఆగూరులో వలంటీర్లను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

రాజాం సిటీ: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్లు చేసిన సేవలే వారికి గుర్తింపు, పురస్కారాలు తెచ్చిపెడుతున్నాయని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా స్థానిక సత్యనారాయణపురం వార్డు సచివాలయం పరిధిలోని ఉత్తమ వలంటీర్లను ఆయన సోమవారం సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదల కన్నీళ్లు తుడిచి, ప్రతీ ఇంటి ముంగిటకు సంక్షేమాన్ని తీసుకువచ్చారన్నారు. అలాగే నిస్సహాయ స్థితిలో ఉన్న వృద్ధులు, వితంతువులు, దివ్యాంగుల వద్దకు ప్రతినెలా ఒకటో తేదీనే వెళ్లి, పెన్షన్‌తో పాటు అనేక అనేక పథకాలు అందిస్తున్నారన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వలంటీర్ల సేవలకు సముచిత గౌరవం లభిస్తోందన్నారు. ఉత్తమ గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్లను సేవామిత్ర కింద రూ.10 వేలు, సేవారత్న కింద రూ.20 వేలు, సేవావజ్ర కింద రూ.30 వేలు నగదు పురస్కారంతో సత్కరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ పురస్కారాలు బాధ్యతను మరింత పెంచేవిగా ఉంటున్నట్లు ఆశిస్తున్నానని, ఇదే స్ఫూర్తితో మున్ముందు కూడా బాగా పనిచేసి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్మోహనరావు, పార్టీ టౌన్, రూరల్ కన్వీనర్లు పి.శ్రీనివాసరావు, ఎల్.రాజగోపాలనాయుడు, వి.విజయ్, డి.గోపాలం, పి.సత్యనారాయణగుప్త, టి.తిరుమల, ఆర్.జయరాం తదితరులు పాల్గొన్నారు.

రాజాం: మండలంలోని దోసరి, ఆగూరు గ్రామ సచివాలయాల్లో సోమవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించి, ఆయా సచివాలయాల పరిధిలోని ఉత్తమ వలంటీర్లను సన్మానించారు. పార్టీ రాజాం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాలనాయుడు మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సేవలు దగ్గర చేయడంతో పాటు అర్హులైన ప్రతీ వ్యక్తికి సంక్షేమ పథకాలు చేరేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకువచ్చిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలకు దేశ వ్యాప్తంగా మంచి పేరుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆయా వ్యవస్థలు రెండు కళ్లు లాంటివని, వాటిని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో కూడా ప్రజలకు మరింత సేవలందించాలని వలంటీర్లను కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వై.వెంకటేష్, ఎంపీడీఓ బి.శంకరరావు, సర్పంచ్‌లు కె.తులసినాయుడు, కె.అనూష, రాజాం వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కె.అప్పారావు, ఎంపీటీసీ వి.ప్రసన్న, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా 'సంక్షేమ' సంతోషం

• 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు



సంతకవిటి: సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంతోషం నెలకొందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని మద్దూరుపేట, శంకరపేట గ్రామాల్లో సోమవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలుచేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి, ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా, అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందన్నారు. ఇప్పటి వరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. గతంలో టీడీపీ ప్రజలు ఏదైనా మేలు చేయాలంటే కమిటీల పేరుతో కాలయాపన చేసేదని, చంద్రబాబు హయాంలో పథకాలు పేరు చెప్పి, ఆయన, ఆయన పార్టీ నాయకులు ప్రజాధనాన్ని దోచుకునే వారని విమర్శించారు. బాబు వస్తే జాబు వస్తాదని ప్రజలను మభ్యపెట్టి, 2014 ఎన్నికల్లో గెలిచారని, తీరా గెలిచాక ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. కానీ ఆయన కొడుకు లోకేష్‌కు మాత్రం ఎన్నికల్లో గెలవకపోయినా మంత్రి పదవిని ఉద్యోగంగా గిఫ్ట్ ఇచ్చారని ఎద్దేవాచేశారు. ప్రస్తుతం అధికారంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలోని ప్రతీ హామీని నెరవేరుస్తోందన్నారు. ఇప్పటివరకు దాదాపు 98 శాతం హామీలు నెరవేర్చిన ఘనత ఒక్క వైఎస్సార్ సీపీకే దక్కుతుందన్నారు. అంతేకాకుండా గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో కొన్ని లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించిన గొప్పతనం సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్మోహనరావు, సర్పంచ్ డి.దాలినాయుడు, ఎంపీటీసీ టి.కాశీ, జేసీఎస్ కన్వీనర్ ఆర్.రమేష్‌నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ జి.కేసరి, సర్పంచ్‌లు డి.తిరుపతి, బి.ప్రసాద్, ఆర్.స్వామినాయుడు, పి.గణపతి, వి.రమణ, కె.వెంకటప్పలనాయుడు, ఎంపీడీఓ రఘునాధాచారి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

వైభవంగా వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

బొబ్బిలి: పట్టణంలోని సింగారపు వీధిలోని వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయంలో రెండు రోజులుగా వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ధర్మకర్త గెంబలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్చకులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన అక్కమ్మ పేరంటాల జాతర

సంతకవిటి: మండలంలోని అక్కరాపల్లి గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న అక్కమ్మ పేరంటాలు జాతర సోమవారంతో ముగిసింది. చివరిరోజు మందరాడ, చిన్నయ్యపేట, చింతలపేట, కాకరాపల్లి గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించి, అన్నప్రసాదం వితరణ చేశారు.

ఘనంగా అసిరితల్లి పండగ

రాజాం సిటీ: మండలంలోని పెనుబాక గ్రామంలో అసిరితల్లి పండగ సోమవారం ప్రారంభమైంది. దాదాపు 14 ఏళ్ల తర్వాత చేపట్టే ఉత్సవం కావడంతో రాష్ట్ర నలుమూలల్లో స్థిరపడిన గ్రామస్తులు ఊరికి చేరుకున్నారు. దీంతో పండగ సందడి నెలకొంది. ఈ నెల 30 వరకు జరిగే ఈ పండగ మహోత్సవాల్లో 28న ఉయ్యాల కంబాల ఉత్సవం, 29న తొలేళ్ల సంబరం, 30న సిరిమానోత్సవం, అనుపోత్సవం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఎంటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు తెలిపారు.

24న నవదుర్గ హుండీ ఆదాయం లెక్కింపు

రాజాం సిటీ: బస్టాండ్ ఆవరణలోని నవదుర్గ అమ్మవారి హుండీ కానుకల లెక్కింపు ఈ నెల 24వ తేదీన చేపట్టనున్నట్లు ఆలయ ఈఓ పి.శ్యామలరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేవదాయ శాఖ తనిఖీదారు, ఆలయ ధర్మకర్తల సమక్షంలో హుండీ లెక్కింపు ఉంటుందని, భక్తులు కూడా పాల్గొనవచ్చన్నారు.

ప్రశాంతంగా ఏపీఈఏపీ సెట్ పరీక్షలు

రాజాం: స్థానిక జీఎంఆర్ఐటీలో ఏపీఈఏపీ సెట్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం జరిగిన పరీక్షకు 260 మందికి గాను 246 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 262 మందికి గాను 253 మంది విద్యార్థులు హాజరయ్యారు.

చురుగ్గా పారిశుద్ధ్య పనులు

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామంలో పారిశుద్ధ్య పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. సోమవారం ఆ పనులను పరిశీలించిన ఎంపీడీఓ జి.కాశీవిశ్వనాథరావు రోడ్లు, కాలువల్లో చెత్తాచెదారం వేయవద్దని, మన పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు.

33 మద్యంసీసాలు స్వాధీనం

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద అక్రమంగా తరలిస్తున్న 33 మద్యంసీసాలను సోమవారం రాత్రి పట్టుకుని, స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఇ.శ్రీనివాస్ తెలిపారు. ఇదే ఘటనకు సంబంధించి, తునివాడ గ్రామానికి చెందిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

తెర్లాం: పదో తరగతి ఫెయిలైన విద్యార్థులంతా త్వరలో జరగనున్న సప్లిమెంటరీ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని మండల విద్యాశాఖాధికారి జె.త్రినాథరావు ఆకాంక్షించారు. మండలంలోని కాగాం హైస్కూల్‌లో పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తే వెంటనే ఇంటర్మీడియట్‌లో చేరవచ్చన్నారు. ఆయనతో పాటు సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

తెర్లాం: మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయా పంచాయతీల పంచాయతీ కార్యదర్శులు సోమవారం పరిశీలించారు. ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శులంతా ఉపాధి పనులు జరిగే ప్రదేశానికి వెళ్లి వేతనదారుల మస్టర్లను, వారు చేస్తున్న పనులను, వేతనదారులకు పని ప్రదేశంలో కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు.

కొండచిలువ హతం

వంగర: మండలంలోని కొట్టిశ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల ప్రదేశంలో సంచరిస్తూ హల్‌చల్ చేసిన కొండచిలువను వేతనదారులు భయంతో కొట్టి, చంపేశారు. సోమవారం పనుల్లో భాగంగా అక్కడి జంగిల్స్‌ను తొలగిస్తుండగా, అది బయటకు వచ్చి, వేతనదారుల చేతికి చిక్కినట్లు తెలుస్తోంది.

చలివేంద్రం ఏర్పాటు

బొబ్బిలి: వేసవిని దృష్టిలో ఉంచుకుని ఆలిండియా పాయమ్‌ఈ ఇన్‌సానియత్ ఫోరం ముస్లిం సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్ జంక్షన్, ప్రభుత్వాస్పత్రి ఎదుట సోమవారం చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎండల తీవ్రత తగ్గే వరకు వీటిని కొనసాగిస్తామని జిల్లా మైనార్టీ అధ్యక్షుడు అబ్దుల్ హమీద్, ముస్లిం మత పెద్ద హాఫీజ్ అబ్దుల్‌కలాం తెలిపారు.

అప్రమత్తంగా ఉండాలి

రేగిడి: రోజురోజుకూ మోసాలు పెరిగిపోతున్నాని, వాటి బారినపడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం మండలంలోని ఒప్పంగి గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు లావాదేవీలు, ఆన్‌లైన్‌లో లావాదేవీల సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అపరిచిత వ్యక్తులను ఎప్పుడూ నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంటా మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

తెర్లాం: మండలంలోని పెరుమాళి ఆదర్శ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జ్యోతిలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులంతా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో ఆంగ్ల మాధ్యమంలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఓసీ, బీసీ, ఈబీసీ విద్యార్థులైతే రూ.200.. ఎస్సీ, ఎస్టీలైతే రూ.150 రుసుం చెల్లించాలని తెలిపారు.

సంప్రదాయ నృత్యాలు నేర్చుకోవాలి

తెర్లాం: బాలికలంతా సంప్రదాయ నృత్యాలైన భరతనాట్యం, కూచిపూడి, కోలాటం వంటి నృత్యాలు నేర్చుకోవాలని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు బ్రహ్మాజీ, స్థానిక శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గ్రంథాలయంలో చిన్నారులకు నృత్యాలపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చిన్నతనంలోనే ఏ కళనైనా సులువుగా నేర్చుకోవచ్చని తెలిపారు.

సకాలంలో పనులు పూర్తి చేయాలి

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో 'మనబడి నాడు - నేడు' ఫేజ్ -2 పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎంఈఓ త్రినాథరావు అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో జరుగుతున్న నాడు - నేడు పనులను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వేసవి సెలవులు ముగిసేలోగా పనులు పూర్తి చేయాలని సూచించారు.

పేదలంటే చంద్రబాబుకు చులకన



చంద్రబాబు వ్యాఖ్యలకు నిరసనగా అంబేడ్కర్ జంక్షన్‌లో మానవహారం చేపట్టిన వైఎస్సార్ సీపీ నాయకులు

రాజాం: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు పేదలంటే ఎప్పుడూ చులకన భావమేనని ఎమ్మెల్యే కంబాల జోగులు విమర్శించారు. అమరావతిలో పేదలకు పక్కా ఇళ్ల కోసం ప్రభుత్వం కేటాయించిన సెంటు స్థలంపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ పట్టణంలోని అంబేడ్కర్ జంక్షన్ వద్ద సోమవారం మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన మీరు పేదల ఇళ్ల నిర్మాణానికి ఏనాడైనా గజం స్థలం కేటాయించారా అని చంద్రబాబును ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలకు చేస్తున్న మేలును చూసి ఓర్వలేకనే అవాకులు, చవాకులు పేలుతున్నారని మండిపడ్డారు. పేదలకు సెంటు స్థలం ఇస్తుంటే అది సమాధి కట్టుకోవడానికే పనికివస్తుందని వ్యాఖ్యానించడం సరికాదన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో సేకరించిన ఇళ్ల స్థలాల్లో టిడ్కో‌ఇళ్ల పేరిట పిచ్చిక గూళ్ల మాదిరి ఇళ్లు కట్టి, పెద్దమొత్తంలో లబ్ధిదారుల నుంచి సొమ్ము కాజేయాలని చూశారని ఆరోపించారు. ప్రస్తుతం అధికారంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం టిడ్కో ఇళ్లలో కొన్ని కొంతమంది పేదలకు ఉచితంగా, మరికొంతమందికి తక్కువ ధరకే ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటోందన్నా. టిడ్కో ఇళ్లు నచ్చని వారికి సైతం ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇంటి నిర్మాణానికి బిల్లులు మంజూరు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. గతంలో కూడా చంద్రబాబు ఎస్సీల్లో ఎవరైనా పుట్టాలని కోరుకుంటారా అని అన్నారని, అదే చంద్రబాబు పతనానికి నాంది పలికిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్మోహనరావు, పార్టీ రాజాం, రేగిడి, వంగర మండలాల కన్వీనర్లు పి.శ్రీనివాసరావు, ఎల్.రాజగోపాలనాయుడు, వి.జగన్మోహనరావు, కె.సుదర్శనరావు, రాజాం జెడ్పీటీసీ బి.నర్సింహులు, రాజాం పీఏసీఎస్ అధ్యక్షుడు వి.చిన్నంనాయుడు, జేసీఎస్ కన్వీనర్ కె.శ్రీరంగంనాయుడు, రాజాం వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కె. అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతో అభివృద్ధి

• జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న జెడ్పీ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, పక్కన ఎమ్మెల్యే శంబంగి, తదితరులు



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

బాడంగి: ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యపడుతుందని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ భోగి గౌరి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాశాఖ, హౌసింగ్, విద్యుత్, వైద్యం, గ్రామీణ తాగునీటి సరఫరా, తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ, పేద ప్రజల అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చెప్పారు. మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ప్రతి ఒక్కరి ఆర్థిక పరిస్థితి చక్కదిద్దుతున్నారని తెలిపారు. జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు త్వరితగతిన బిల్లులు చెల్లించాలని సూచించారు. 104 వాహన సేవలు ఏయే రోజుల్లో ఏయే గ్రామాల్లో అందిస్తారో ముందుగా తెలియజేయాలన్నారు. నాడు-నేడు ఫేజ్ 1,2 లలో మిగిలిపోయిన భవన నిర్మాణాలను ఫేజ్-3లో చేర్చి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల డీపీఆర్ తయారీ విషయమై అధికారులు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో అసంతృప్తి చెందిన చైర్మన్ డీఈఓ, సీఈఓలతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పలువురు ప్రజా ప్రతినిధులు సమస్యలను సభ దృష్టికి తీసుకురాగా, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, వైస్ ఎంపీపీలు బి.రమేష్, ఎస్.భాస్కరరావు, డిప్యూటీ సీఈఓ రాజ్‌కుమార్, డీఎల్‌డీఓ (విజిలెన్స్) రవీంద్ర, ఎంపీడీఓ అక్కా రావు, తహసీల్దార్ బాలమురళీకృష్ణ, డీఈఈ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



విద్యార్థిని సన్మానిస్తున్న ఎంపీపీ సురేష్ ముఖర్జీ

వంగర: విద్యార్థులు క్రమశిక్షణతో బాగా చదివి, విద్యలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు తూతిక దీపిక, కరణం రాధికను సోమవారం సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీవితంలో ఏదైనా సాధించాలన్న లక్ష్యంతో చదవాలని, రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల పార్టీ కన్వీనర్ కె.సుదర్శనరావు, డీటీ బి.సుందరరావు, ఎంఈఓ వై.దుర్గారావు, ఈఓపీఆర్‌డీ ఎల్.త్రినాధరావు, ఏపీఓ ఎస్. సంగంనాయుడు, ఏపీఎం ఎం.చక్రపాణి, ప్రిన్సిపాల్ కె.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో అభివృద్ధి

• ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

బొబ్బిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారని, తద్వారా గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని పారాదిలో సోమవారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, తదితరులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల వల్ల ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరినదీ వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అలాగే స్థానిక సమస్యలు అడిగి తెలుసుకుని, వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేని టీడీపీ, జనసేన నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కుట్రలు చేస్తున్నారన్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేనకు గట్టిగానే బుద్ధి చెబుతారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ తమ్మిరెడ్డి దామోధరరావు, మండల ఉపాధ్యక్షుడు అరసాడ శంకర రావు, కనిమెరక సత్యం, ఉత్తరావిల్లి అప్పలనాయుడు, ఎస్పీ రాజు, అల్లాడ ప్రసాద్, ధనుంజయనాయుడు, అల్లాడ ఈశ్వర రావు, కోఆప్షన్ సభ్యుడు షేక్ సర్దార్, మండల పరిషత్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్నిఅస్త్రం తయారీపై అవగాహన

రాజాం: మండలంలోని బొద్దాం గ్రామంలో అగ్ని అస్త్రం తయారీపై సోమవారం అవగాహన కల్పించారు. రైతు పాట్నూరు గోపి పంట పొలంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ అగ్ని అస్త్రం అనే సేంద్రియ ఎరువు ద్వారా పంటకు పట్టే చీడపీడలను నివారించవచ్చన్నారు. నాలుగు ఎకరాల్లోని వంగ పంటకు పట్టే కాయ, కాండం తొలిచే పురుగు నివారణకు 50 లీటర్ల అగ్నిఅస్త్రం తయారీని ప్రయోగాత్మకంగా వివరించారు. 50 లీటర్ల ఆవుమూత్రం, 5 కిలోల పొగాకు, 5 కిలోల పచ్చిమిర్చి, రెండున్నర కిలోల వెల్లుల్లి, పది కిలోల వేపాకు, ఐదు కిలోల ముసిడి చెక్క తీసుకుని ఆవుమూత్రంలో వేసి, మూడు పొంగులు వచ్చినంత వరకు మరగబెట్టాలని తెలిపారు. ఆ తర్వాత చల్లార్చి, ట్యాంక్‌కు లీటరు చొప్పున వేసి పంటపై పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ తిరుపతిరావు, రైతులు పాల్గొన్నారు.